సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 20 । జనవరి । 2024



అమ్మ లేదు.. నాన్న రాడు

తండ్రికి దూరమై..తల్లిని కోల్పోయి ఇద్దరు చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. భవిష్యత్ చీకటిమయమైంది. - 8లో



వారంలో రూ.2.22 కోట్లు

ఆర్టీసీకి సంక్రాంతి కానులు కురిపిస్తోంది. వారంలో రూ.2కోట్ల ఆదాయం వచ్చింది. - 8లో

పోలీసుల ఉదారత

బూర్జ : మండలంలో గల టీఆర్‌రాజు పేట గ్రామం పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలను స్థానిక పోలీసులు సొంత ఖర్చులతో తొలగించారు. స్థానిక ఎస్‌ఐ జి.అశోక్‌బాబు ఆధ్వర్యంలో టీఆర్ రాజు పేట గ్రామం నుంచి కొల్లివలస గ్రామం వరకు జంగిల్ క్లియరెన్స్ చేస్తామన్నారు. గ్రామం మలుపు వద్ద తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నందున ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

ఏపీ ఫైబర్‌లో ఉపాధికి అవకాశం

శ్రీకాకుళం: జిల్లాలో అన్ని కుటుంబాలకు ఫైబర్ నెట్ కనెక్షన్లు అందించేందుకు నూతన వ్యాపారులకు ఈ నెల 22న అవగాహన సమావేశం నిర్వహిస్తున్నామని చైర్మన్ ఎల్.గౌతమ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పల్లెలు, పట్టణాల్లో ఈ నెట్ సేవలందించేందుకు ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పాతశ్రీకాకుళంలోని శ్రీ సత్యసాయి గణేష్ మందిరం సమీపంలోని ఈ వేదిక ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్‌నెట్, చానెల్ సెటప్ బాక్సు, ఓటీటీ, ధరలపై తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

'పట్టుదలతో చదవండి'



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా 100 మంది మెరిట్ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గ్రూప్-2 ప్రిలిమ్స్‌కు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నారు. వీరికి శుక్రవారం ఇన్‌చార్జి కలెక్టర్ స్టడీ మెటీరియళ్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, జిల్లా వెనుకబడిన సంక్షేమ అధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు నందిగాం సర్పంచ్



జద్యాడ రమణమ్మ

నందిగాం: దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర వేడుకలకు నందిగాం పంచాయతీ సర్పంచ్ జద్యాడ రమణమ్మ వెళ్లనున్నారు. ఈ వేడుకలకు రాష్ట్రం నుంచి 13 మంది సర్పంచ్‌లు ఎంపిక కాగా వారిలో నందిగాం సర్పంచ్ రమణమ్మ ఒకరు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి వీరికి సమాచారంతో అందడంతో పాటు పాస్‌లు కూడా వచ్చాయి. నందిగాం సర్పంచ్‌గా రమణమ్మ ఎన్నికైన తర్వాత ఆమె సేవలకు గుర్తింపుగా ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో ఆమెకు పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయంలో సన్మానం కూడా జరిగింది. ఇప్పుడు దేశ స్థాయిలో గణతంత్ర వేడుకలకు ఎంపిక కావడం గమనార్హం.

'ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా రూపొందించిందని తెలిపారు. రైతు ఎంతో కష్టపడి పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధరను ఇవ్వడం మన బాధ్యత అని, ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 79,177 రైతుల నుంచి 3లక్షల 60 వేల టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేశామని, 70,174 మంది రైతులకు 608.38 కోట్లు చెల్లింపులు చేయడం జరిగిందని మిగిలిన రైతులకు చెల్లించాల్సిన రూ.177.51 కోట్లు నాలుగైదు రోజుల్లో చెల్లిస్తామని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వర రావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, గొండు రఘురామ్, మత్స్య శాఖ ఏడీ శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ జేడీ కిశోర్, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, డ్వామా పీడీ చిట్టి రాజు, ఎల్‌డీఎం సూర్య హరికిరణ్ హాజరయ్యారు.

ఏఆర్ పోలీసులకు రీఫ్రెష్ శిక్షణ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా సాయుధ దళాల పోలీస్ విభాగం (ఆర్మ్‌డ్ రిజర్వ్) సిబ్బందికి రీఫ్రెష్ కోర్సు మొబలైజేషన్‌లో భాగంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎస్పీ జీఆర్ రాధిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 22 నుంచి 15 రోజుల పాటు 19 అంశాల్లో 373 మంది ఏఆర్ పోలీసులు తర్ఫీదు పొందనున్నారు. 19 అంశాల్లో వారు నిర్వర్తించాల్సిన విధులనే మళ్లీ జ్ఞప్తికి తెచ్చేలా, వారి సామర్థ్యాలు పరీక్షించుకునేలా శిక్షణ ఉంటుంది.

నిరంతర శ్రమ.. నిత్య పర్యవేక్షణ



క్లీన్‌గా ఉన్న శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్



స్టేషన్‌లో నిరంతరం పనులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నిరంతర శ్రమ.. నిత్య పర్యవేక్షణ కలగలిపి ఆమదాలవలస రైల్వే స్టేషన్‌కు క్లీన్ రైల్వేస్టేషన్ అవార్డు వరించింది. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి కేంద్రం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకుంటూ స్టేషన్ అభివృద్ధికి బాటలు వేశారు. ఈ రైల్వే స్టేషన్ నుంచి నిత్యం సుమారు 65 నుంచి 70 రైళ్లు రాకపోకలు చేస్తుంటాయి. దాదాపు 8వేల నుంచి పదివేల మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. పండగల సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇక్కడ నిత్యం 20 మంది పారిశుద్ధ్య కార్మికులు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతుంటారు. ప్లాట్‌ఫాంపై ఎలాంటి చెత్త లేకుండా ఎక్కడికక్కడ చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. విశ్రాంతి గదుల వద్ద పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేశారు. దీంతో తమకు క్లీన్ రైల్వేస్టేషన్ అవార్డు లభించిందని స్టేషన్ మాస్టర్ మొదవలస రవికుమార్ ఆనందం వ్యక్తం చేశారు. భువనేశ్వర్‌లో అవార్డు అందుకున్నారు. - ఆమదాలవలస

రైళ్లు రాకపోకలు **65** నుంచి **70**



ప్రయాణికులు **8**వేల నుంచి **10**వేల మంది

ఊరికి ఊరట

- పీహెచ్‌సీలో నాణ్యమైన వైద్య పరీక్షలు
- అందుబాటులోకి అధునాతన పరికరాలు
- 63 రకాల పరీక్షలు చేసే సదుపాయం
- ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ పూర్తి

నరసన్నపేట:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపురేఖలు మారుతున్నాయి. ఇదివరకు పరిమిత పరీక్షలకే పరిమితమైన ఈ పీహెచ్‌సీలు ఇప్పుడు 63 రకాల వైద్య పరీక్షలు చేసే స్థాయికి ఎదిగాయి. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి అటు పీహెచ్‌లను ఇటు సీహెచ్‌సీలకు అభివృద్ధి చేస్తూ మౌలిక వసతులు కల్పిస్తోంది. ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా చర్యలు చేపట్టింది. దీంతో ప్రస్తుతం జిల్లాలో ఉన్న 68 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలు పూర్తి స్థాయిలో చేస్తున్నారు. గత ప్రభుత్వ కాలంలో పీహెచ్‌సీలో రక్త పరీక్ష చేసుకుంటే మూడు రోజులకు గానీ ఆ ఫలితాలు అందేవి కావు. అప్పట్లో ల్యాబ్ టెక్నీషియన్లు కూడా ఉండేవారు కాదు. నేడు పరిస్థితులు అన్నీ మారాయి. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. రిపోర్టులు కూడా నిమిషాల్లో వస్తున్నాయి. దీని ఆధారంగా వైద్యులు మందులు ఇస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా సజావుగా పీహెచ్‌సీలోనే జరుగుతుండడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో ఆధునిక పరికరాలు..

ప్రస్తుతం పీహెచ్‌సీలకు ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, సెమీ ఆటో బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్, మైక్రోస్కోప్, ఈఎస్ఆర్ ఎనలైజర్, సెంట్రీఫ్యూజ్, టీబీ ఆర్‌టీ పీఆర్ వంటి పరికరాలతో పాటు మరిన్ని పరికరాలు అందుబాటులోకి వచ్చా యి. మరికొద్ది రోజుల్లో సీబీసీ పరికరం కూడా అందుబాటులోకి వస్తుందని వైద్యాధికారులు అంటున్నారు.



మాకివలస పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ ఇందిర



చేసే వైద్య పరీక్షలు..

సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, యూఆర్ఈఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ టోటల్ బ్లడ్ సెల్ కౌంటర్, ర్యాండమ్ బ్లడ్ సుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్‌ఐవీ, హెపటైటిస్-బీ, డెంగీ, మలేరియా, బ్లీడింగ్, క్లాటింగ్ టైమ్, థైరాయిడ్, పొటాషియం క్లోరైడ్ తదితర 63 రకాల పరీక్షలు చేస్తున్నారు.



ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేసిన ఆధునిక పరికరాలు

పరీక్షల తీరు బాగుంది



ఆస్పత్రికి వచ్చిన వెంటనే అవసరమైన వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇవే రక్త పరీక్షలకు బయట రూ.600 వరకూ వెచ్చించాల్సి వచ్చేది. ఇప్పుడు వైద్యుని సలహా మేరకు ఉచితంగా చేస్తున్నారు. బాగుంది. గతంలో ఆస్పత్రికి రావాలంటే నిస్పృహగా ఉండేది. ఇప్పుడు ఏ ఇబ్బంది కలిగినా ఆస్పత్రికి వచ్చి వైద్యం తీసుకుంటున్నాం. వైద్యులు కూడా అందుబాటులో ఉంటున్నారు. మాలాంటి పేద రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు అందుతున్నాయి.

- యాళ్ల పూజిత, మాకివలస

అన్ని రకాల పరీక్షలు..



అవసరం మేరకు అన్ని పరికరాలు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఇప్పటికే నాలుగైదు రకాల పరికరాలు వచ్చాయి. మరో వారం రోజుల్లో మరో రెండు రకాల పరికరాలు వస్తాయి. వచ్చిన రోగులకు అవసరమైన మేరకు రక్త పరీక్షలు చేస్తున్నాం. పట్టణాలకు, ప్రైవేటు ల్యాబ్‌లకు రోగులు వెళ్లాల్సిన పరిస్థితి లేదు. రోగులు సక్రమంగా వినియోగించుకోవాలి.

- సుజాత, వైద్యాధికారి, ఉర్లాం

పీహెచ్‌సీల్లోనే రక్త పరీక్షలు



వారం రోజులుగా జ్వరం వస్తుందని ఆస్పత్రికి వచ్చాను. అన్ని రకాల వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు చేశారు. సంతోషంగా ఉంది. ఇవే రక్త పరీక్షలు బయట చేయించుకోవాలంటే పట్టణాలకు వెళ్లి నానా ఇబ్బందులు పడేవారం. ఇప్పుడు ఎలాంటి శ్రమ, ఇబ్బంది, ఖర్చు లేకుండా ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్నారు.

- అడివరపు పాపమ్మ, కొల్లవానిపేట, నరసన్నపేట మండలం

'భీమిలి సభకు సిద్ధం కావాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల శంఖారావం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర నుంచే ప్రారంభించనున్నారని, ఈ నెల 25న భీమిలిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. జిల్లాలో నరసన్నపేటతో పాటు అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఈ సభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు స్థానికంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని కార్యకర్తలను సిద్ధం చేయాలన్నారు. ఈ సభలో రానున్న ఎన్నికలకు సంబంధించి కార్యకర్తలకు, నాయకులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేయనున్నారని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య, నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్క తులసీదాస్, చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, ముద్దాడ బైరాగినాయుడు, మొజ్జాడ శ్యామ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కుల గణనకు సహకరించండి

శ్రీకాకుళం పాతబస్టాండ్, శ్రీకాకుళం రూరల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కులగణన మొదలైంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేశారు. కులగణనకు జనం సహకరించాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఆయన పెదపాడులోని తన క్యాంపు కార్యాలయంలో కులగణనను లాంఛనంగా ప్రారంభించారు.

- మంత్రి ధర్మాన పిలుపు



కులగణనను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

కుల గణనకు జనం సహకరించాలి. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలు కోసం జనాభా ప్రాతిపదికన అవసరమైన బడ్జెట్ కేటాయింపు, విధాన నిర్ణయాలు అమలు చేయడానికి సామాజిక ఆర్థిక పరిస్థితులు, అలాగే కులాల వారీగా ఎవరు ఎంత మంది ఉన్నారనేది ఈ కులగణన ద్వారా తెలుస్తుంది. జనాభా ప్రాతిపదికన ఆయా కులాలకు నిధులు కేటాయింపు కోసం కూడా ఇది ఉపయోగపడుతుంది. పది రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కలిసి కుటుంబ వివరాలను సేకరించడానికి ఇంటింటికీ తిరుగుతారు.

- ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి



శ్రీకాకుళం రూరల్ మండలం వాకలవలసలో కుల గణన చేస్తున్న వలంటీరు, సచివాలయం ఉద్యోగి

తొలిరోజు ఇలా...

మొత్తం సచివాలయాలు	732
తొలిరోజు గణన చేసిన సచివాలయాలు	728
మొత్తం క్లస్టర్లు	12,503
తొలిరోజు గణన	5031
మొత్తం కుటుంబాలు	7,38,704
తొలి రోజు గణన	18,830 (2.55%)
మొత్తం జనాభా	21,75,086
తొలి రోజు గణన	35,000 (1.61%)

అంబేడ్కర్ స్మరణలో..

విజయవాడలో అంబేడ్కర్ మహాశయుని విగ్రహావిష్కరణ సందర్భంగా జిల్లాలో శుక్రవారం సంఘీభావ ర్యాలీలు జరిగాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొని అంబేడ్కర్ ఆశయాలను మరోసారి గుర్తు చేశారు. ఆ మహనీయుని సిద్ధాంతాలను స్మరించుకున్నారు. అంబేడ్కర్ కలలను నిజం చేసేలా పాలన సాగుతోందని ప్రశంసించారు.



నరసన్నపేట: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తదితరులు

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

బీఆర్ అంబేడ్కర్ మన దేశ పౌరుడు కావడం మనకు గర్వకారణం. ఆయన మహోన్నత మనిషి. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ అంబేడ్కర్‌కు ఎత్తైన విగ్రహం ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ ఆశయాలు, సిద్ధాంతాలు సాకారం చేస్తూ వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారు.

- ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు (నరసన్నపేటలో నిర్వహించిన సంఘీభావ కార్యక్రమంలో..)



కాశీబుగ్గ: అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి అప్పలరాజు

ముఖ్యమైన రోజు..

విజయవాడలో నిలువెత్తు అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటు రాష్ట్ర చరిత్రలోనే ముఖ్యమైన రోజుగా మిగిలిపోతుంది. కొన్ని పత్రికలు ఈ అంశాన్ని కూడా వివాదాస్పదం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి వాటిని ప్రజలు గమనిస్తున్నారు. ఈ విగ్రహం సాక్షిగా సమసమాజ స్థాపన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

- సీదిరి అప్పలరాజు, మంత్రి (పలాసలో నిర్వహించిన సంఘీభావ కార్యక్రమంలో..)

విశ్వ నాయకుడు అంబేడ్కర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీఆర్ అంబేడ్కర్ విశ్వ నాయకుడని, నేటితరం ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు నడవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వర రావు అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఏర్పాటు చేసిన సంఘీభావ మారథాన్‌ను ఆయన జిల్లా అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు.



మారథాన్ నిర్వహిస్తున్న జిల్లా అధికారులు, క్రీడాకారులు

క్లుప్తంగా

ఎంఈఓ-1 అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక


ఎస్.జోరాడు

ఎల్.ఈశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: మండల విద్యాశాఖ అధికారులు-1(ఎంఈఓ-1) అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా నూతన కమిటీ శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపికైంది. జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎంఈఓ-1 అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయ మజ్జి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్.జోరాడు (సోంపేట ఎంఈఓ-1), ప్రధాన కార్యదర్శిగా ఎల్.ఈశ్వరరావు (లావేరు ఎంఈఓ 1), ఉపాధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాసనాయక్ (పోలాకి ఎంఈఓ1)ను ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే మరికొంతమందికి జిల్లా కార్యవర్గంలో అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు.

'పిల్లల కేసులు త్వరగా పరిష్కరించాలి'


జువెనైల్ బోర్డులో అధికారులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చట్టంతో విభేదించే పిల్లల కేసులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక జువెనైల్ జస్టిస్ బోర్డును ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జువెనైల్ జస్టిస్ బోర్డ్ యంత్రాంగమంతా త్వరితగతిన పిల్లల కేసులు పరిష్కారం చేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ కందికట్ల రాణి, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్ రవికుమార్, జువెనైల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ శ్రీదేవి, లీగల్ ఆఫీసర్ లక్ష్మణరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సుశీల, ఇతర న్యాయ వాదులు పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

'సామాజిక సంఘ సంస్కర్త వేమన'


వేమన చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: యోగి వేమన ఓ సామాజిక సంఘ సంస్కర్త అని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఆయనను స్మరించుకునేందుకు ప్రభుత్వం వేమన జయంతిని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ తేట తెలుగు పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తన కవిత్వంతో సమాజాన్ని జాగృతం చేసిన కవి యోగి వేమన అన్నారు. వేమన పద్యం ఒకటైనా రాని తెలుగు వారు ఉండరని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, వెనుకబడిన సంక్షేమ అధికారి బి.అనురాధ, కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్లు ఎం.శ్రీకాంత్, ప్రకాష్, రామమూర్తి, బీసీ వెల్ఫేర్ వార్డెన్లు సిబ్బంది పాల్గొన్నారు.

భూతగాదాలో వ్యక్తిపై దాడి

బూర్జ : మండలంలో గల అయ్యవారి పేట గ్రామానికి చెందిన చోడవరపు మురళి, సోదరుడు చోడవరపు సింహాచలం కలిసి ఇప్పిలి శిమ్మన్న అనే వ్యక్తిపై దాడికి దిగారు. స్థానికంగా 80 సెంట్ల భూమి విషయంలో కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ అంశాన్ని తహసీల్దార్ ఎస్.రమణారావు ఆధ్వర్యంలో పరిష్కరించుకునేందుకు ముగ్గురూ కలిసి గురువారం ఆయన కార్యాలయానికి వెళ్లారు. అక్కడ మాటామాటా పెరగడంతో అది కాస్తా కొట్లాటకు దారి తీసింది. ఈ కొట్లాటలో శిమ్మన్నకు దెబ్బలు తగిలి రక్తస్రావమైంది. వెంటనే ఆయనను 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐ బి.అశోక్‌బాబు శుక్రవారం కేసు నమోదు చేశారు.

వరినారు పెంపకంలో మెలకువలు పాటించాలి

జలుమూరు: వరి నారు పెంపకంలో మెలకువలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. నారు ఎర్రగా ఉండి ఆకులపై మచ్చలు ఉంటే అగ్గి తెగులు సోకినట్లు గుర్తించి తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే రెండు మూడు రోజులకు ఒక సారి నారు మడికి నీరు పెట్టి విడిచిపెట్టాలని తెలిపారు. ప్రధానంగా శీతాకాలంలో నారు పెరుగుదల తక్కువగా ఉంటుందని, వీటికి తోడు పోషకాలు తీసుకోవని, అదే సమయంలో మూడు 19లు పిచికారీ చేయాలన్నారు. వీటిపై సూచనలు,సలహాలు కావాల్సిన వారు 8331056225 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

వారంలో రూ. 2.22 కోట్ల ఆదాయం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం ఏపీఎస్ ఆర్టీసీ రెండు డిపోలకు ఈ వారం రోజుల్లో రూ. 2.22 కోట్ల మేర ఆదాయం సమకూరినట్లు డిపోల మేనేజర్లు మల్లికార్జునరావు, ఎస్ఎస్‌శర్మలు శుక్రవారం పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి 18 వరకు డిపో-1 నుంచి రూ.1,18,68,000లు, డిపో-2 నుంచి రూ. 1,03,38,000లకు పైగా ప్రయాణికుల టికెట్టు చార్జీల ద్వారా వచ్చిందన్నారు. ఆదివారం వరకు ప్రయాణికుల రద్దీ ఉండవచ్చని, ఆ రోజు మరింత ఎక్కువ ఉంటుందనే ఆలోచనతో మరిన్ని సర్వీసులు పెంచుతామన్నారు. గురువారం ఒక్క రోజే రెండు డిపోలనుంచి రూ. 43 లక్షల మేర ఆదాయం వచ్చిందన్నారు.


బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

	డిపో-1	డిపో-2
తేదీ	ఆదాయం	ఆదాయం
12/01	రూ. 17.19 లక్షలు	రూ. 16.40 లక్షలు
13/01	రూ. 20.65 లక్షలు	రూ. 16.37 లక్షలు
14/01	రూ. 15.30 లక్షలు	రూ. 17.73 లక్షలు
15/01	రూ. 09.93 లక్షలు	రూ. 08.17 లక్షలు
16/01	రూ. 13.62 లక్షలు	రూ. 08.96 లక్షలు
17/01	రూ. 18.90 లక్షలు	రూ. 15.75 లక్షలు
18/01	రూ. 23.09 లక్షలు	రూ. 20.00 లక్షలు


శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ


నాన్‌స్టాప్ కౌంటర్‌లో..

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


తులసీదాస్ (ఫైల్)

జలుమూరు: మండల పరిధి లింగాలవలసకు చెందిన వాన తులసీదాస్(35) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. తులసీ దాస్ రాత్రి భోజనం ముగించుకొని ఆరుబయటకు వచ్చి రోడ్డుకు పక్కగా నడుస్తుండగా అటుగా వెళ్తున్న ఒడిశా ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టి ఆయనపై నుంచి వెళ్లిపోయింది. దీంతో తులసీదాస్ శరీరం నుజ్జునుజ్జయిపోయింది. ప్రమాదం జరిగాక కనీసం బస్సు ఆపలేదు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో విశాఖపట్నం నుంచి ఒడిశాలోగల భవానీ పట్నం వెళ్లే ఈ ఒడిశా ఆర్టీసీ బస్సును పాతపట్నం వద్ద పోలీసులు ఆపారు.

మృతుడికి తండ్రి మల్లేశ్వరరావు, తల్లి సుమతి ఉన్నారు. ఒక్కగానొక్క కొడుకు ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. తండ్రి మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి కోర్సు బలోపేతం లక్ష్యం: వీసీ


మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ప్రతి కోర్సు బలోపేతం చేస్తామని బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీ సెమినార్ హాల్‌లో శుక్రవారం బోధన సిబ్బందితో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో ఉత్తమ విశ్వ విద్యాలయంగా తీర్చిదిద్దటం తన ముందు ఉన్న లక్ష్యమని వివరించారు. అందుకోసం అందరూ సహకరించాలని కోరారు. వర్సిటీలో అన్ని కోర్సుల్లో మెరుగైన ప్రవేశాలు, విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య, రిలీవైన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా పలు మార్పులు చేయాలన్నారు. ప్రతివారం అకడమిక్ కరిక్యులమ్ నిర్వహణ నివేదిక అందజేయాల్సి ఉంటుందని, విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకుంటామని వివరించారు. లోపాలు ఉంటే సరిదిద్దుతామని చెప్పారు. బోధకుల్లో సమయపాలన, అంకిత భావం తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యలో ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు, ఇంటర్న్‌షిప్ తప్పనిసరని వివరించారు. విద్యా సంస్థల్లో విద్యార్థుల ప్రయోజనాలకు మాత్రమే మొదటి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య నిర్వహిస్తున్న కోర్సులు, పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది వివరాలు, రెగ్యులర్, కాంట్రాక్టు, గెస్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వివరాలు వివరించారు.

'దేశ ప్రగతే లక్ష్యం'


మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్ నర్సింహారావు, పక్కనే కమిషనర్ ఓబులేసు, బీజేపీ జిల్లా నేతలు

శ్రీకాకుళం న్యూకాలనీ: భవిష్యత్‌లో భారతదేశం అభివృద్ధి పథంలో పయనించాలనేదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని, అందులో భాగంగానే దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర చేపడుతున్నట్లుగా బీజేపీ జాతీయ స్థాయి నేత, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నర్సింహారావు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి జీవీఎల్ హాజరై మాట్లాడారు. మోదీ గ్యారంటీ, మోదీ హామీ పేరుతో 18 సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 2047లోపు దేశాన్ని స్వయం సంవృద్ధి సాధించి అభివృద్ధి చేసుకుందామని, వలసలను వదిలించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు తదితరులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్‌పై దాడి


క్షతగాత్రుడు జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: డి.మత్స్యలేశం సర్పంచ్ మూగి ఈశ్వరమ్మ... తండ్రి, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్, న్యాయవాది మూగి శ్రీరాములపై ఇదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు శుక్రవారం దాడి చేశారు. శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయనను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి పరామర్శించారు. భూ సర్వే జరుగుతుండగా తమకు సంబంధం లేకపోయినా ఐదుగురు టీడీపీ కార్యకర్తలు అకారణంగా దాడి చేసినట్లు శ్రీరాములు చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సీఐ జి.రామచంద్రరరావు రిమ్స్‌కు చేరుకొని వివరాలు సేకరించారు.

'రాష్ట్రంలో క్రీడలకు ప్రాణం పోసింది సీఎం జగన్'


జిల్లా కబడ్డీ జట్ల క్రీడాకారులతో చింతాడ రవికుమార్, సుందరరావు, ఎంవీ రమణ, సాధు శ్రీను

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో క్రీడలకు ప్రాణం పోసి, క్రీడాకారులకు ఆత్మగౌరవాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ చింతాడ రవికుమార్ అన్నారు. కర్నూలు జిల్లా నంద్యాలలో ఈనెల 20 నుంచి 24 వరకు ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల కోసం జిల్లా క్రీడాకారులు శుక్రవారం శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ నుంచి పయనమై వెళ్లారు. వీరికి క్రీడాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. అంతకుముందు జిల్లా కబడ్డీ జట్లకు ఎంపికైన బాలురు, బాలికలకు క్రీడాదుస్తులను డాక్టర్ చింతాడ రవికుమార్ సమకూర్చారు. వాటిని ఒలింపిక్, పీఈటీ సంఘ నాయకుల సమక్షంలో క్రీడాకారులకు అందజేశారు. ఒలింపిక్ సంఘ జిల్లా సలహాదారుడు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, మెట్ట తిరుపతిరావు, కబడ్డీ సంఘ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, సాధు మునలినాయుడు, కోటేశ్వరరావు, సీహెచ్ ఫల్గుణరావు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు పరిశీలన


అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించిన తహసీల్దార్ చక్రవర్తి, ఎస్ఐ అహ్మద్

కొత్తూరు: మండలంలోని ఆంధ్రా ఒడిశా సరిహద్దు సీతాపురం - దిమిలి కూడలి మధ్య ఒడిశా చెక్‌పోస్టును స్థానిక తహసీల్దార్ చక్రవర్తి, ఎస్ఐ ఎంఏ అహ్మద్‌లు శుక్రవారం పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున చెక్ పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆంధ్రా నుంచి అనుమతులు లేకుండా ఎలాంటి వస్తువులు తీసుకువచ్చినా నిశితంగా పరిశీలించాలన్నారు. ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలని చెప్పారు.

తిలారు రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జలుమూరు: తిలారు రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫారమ్‌పై గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్లు పలాస జీఆర్‌పీ ఎస్.ఐ కె.షరీఫ్ తెలిపారు. ముప్పై నుంచి ముప్పై ఐదేళ్ల మధ్య వయస్సు ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 9440627567 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. దీనిపై ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన దుర్గాదేవి జాతర


పూజలందుకున్న దుర్గాదేవి


అమ్మవారి దర్శనానికి బారులు దీరిన భక్తులు


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


జి.సిగడాం: మధుపాం గ్రామంలో మూడు రోజులు నిర్వహించిన దుర్గాదేవి జాతర మహోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రశాంతంగా జాతర ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా జి.సిగడాం ఎస్సై సామంతుల రామారావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. చివరి రోజున భారీగా భక్తులు వచ్చి అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

'వ్యక్తిగత క్రమశిక్షణ తప్పనిసరి'


పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ తిప్పేస్వామి

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసుల్లో వ్యక్తిగత క్రమశిక్షణ తప్పనిసరని శ్రీకాకుళం అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శుక్రవారం పోలీస్‌ల ప్రత్యేక పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ పర్యవేక్షించారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరి పరేడ్, దేహ దారుఢ్యం పరిశీలించారు. ఫిట్‌నెస్, ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు. పోలీస్ వృత్తిలో దేహ దారుఢ్యం, మానసిక ఆరోగ్యం రెండూ కీలకమని చెప్పారు. నిరంతరం వ్యాయామం చేయాలని, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. నిరంతరం ఉత్సాహంగా, అనుకూల దృక్పథంతో పోలీసులు ముందుకు సాగాలంటే ఒత్తిడికి దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు వై.శృతి, ప్రసాదరావు, వాసుదేవ్, చొప్పరాజు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు డి.సురేష్, ఉమామహేష్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి


మృతుడు బుచ్చిబాబు

గార: మండలంలోని అంపోలు పంచాయతీ లింగాలవలస గ్రామానికి చెందిన పెద్దాడ బుచ్చిబాబు (52)మద్యం మత్తులో మురుగు కాలువలో పడి మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుచ్చి బాబు లింగాలవలస కాలనీలో నివాసం ఉంటున్నారు. తల్లితండ్రులు పాత ఊరులో ఉండగా.. అక్కడికి వెళ్తానని గురువారం రాత్రి ఇంటి వద్ద చెప్పి బయల్దేరారు. దారిలో మురుగు కాలువ వద్ద తూలిపోయి నీటిలో పడి మృతి చెందాడు. ఉదయం కుటుంబ సభ్యులు వెతకగా.. గ్రామస్తులు కాలువలో ఉన్న బుచ్చిబాబును చూసి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అప్పటికే ఆయన ప్రాణాలు పోయాయి. కుమారుడు తిరుమల ఫిర్యాదు మేరకు గార పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మ లేదు.. నాన్న రాడు

జనమంతా సంక్రాంతి రోజున సంబరాల్లో ఉంటే.. ఆ ఇద్దరు ఆడపిల్లలు మాత్రం తల్లి మరణవార్త విని గుండెలవిసేలా రోదించారు. పండగ పూట అన్ని కుటుంబాలు బంధుమిత్ర సపరివారంతో కళకళలాడుతుంటే.. ఆ ఇల్లు మాత్రం తల్లి వెళ్లిపోయిన పక్షి గూటిలా నిశ్శబ్దమైపోయింది. నాన్న ఎటు వెళ్లిపోయాడో తెలీదు.. అమ్మ ఎందుకు ఆత్మహత్య చేసుకుందో అర్థం చేసుకునే వయసు లేదు. ఉన్న అమ్మమ్మకు ఇద్దరు ఆడ పిల్లలను పోషించేందుకు శక్తి చాలదు. ఇన్ని కష్టాల మధ్య ఇద్దరు ఆడ బిడ్డలు అవస్థ పడుతున్నారు. దాతలు మాత్రమే ఈ పిల్లలకు ఓ దారి చూపగలరు.

- ఐదేళ్ల క్రితం కుటుంబాన్ని విడిచిపెట్టిన తండ్రి
- సంక్రాంతి రోజు తల్లి ఆత్మహత్య
- దిక్కుతోచని స్థితిలో ఇద్దరు ఆడపిల్లలు

ఇచ్ఛాపురం రూరల్:

చిన్నప్పుడే తండ్రి వాత్సల్యానికి ఆ పిల్లలు దూరమైపోయారు. ఇన్నాళ్లు అమ్మ అండగా నిలబడడంతో ధీమాగా ఉన్నారు. ఇప్పుడు ఏ కష్టం వచ్చిందో ఆ కన్నతల్లి కూడా పిల్లలను వదిలి శాశ్వతంగా వెళ్లిపోయింది. ఇప్పుడా చిన్నారులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామానికి చెందిన మల్లవరపు వెంకటలక్ష్మి(31) చెన్నైలో కూలి పనులు చేసుకుంటున్న సమయంలో 11 ఏళ్ల క్రితం అక్కడే వేరే వ్యక్తితో పెరిగిన పరిచయం పెళ్లి వరకు దారితీసింది. వీరికి శరణ్య, లిఖిత పుట్టారు. ఐదేళ్ల కిందటి వరకు సుఖంగా సాగిన ఈ దంపతుల కాపురంలో కలతలు రావడంతో పెద్దలు సమక్షంలో విడాకులు తీసుకున్నారు. దీంతో ప్రస్తుతం వెంకటలక్ష్మి వద్దనే ఆడపిల్లలు ఉంటున్నారు. ఏడాది కిందటి వరకు చెన్నైలోనే వెంకటలక్ష్మి పనిచేసేవారు. పిల్లలను తేలుకుంచిలోని తన పెద్దమ్మ వద్ద ఉంచుతూ చదివించారు. ఆరు నెలల కిందట ఆమె స్వగ్రామానికి వచ్చారు.


తల్లి మృతితో అనాథలుగా మారిన చిన్నారులు శరణ్య, లిఖితలు

సంక్రాంతి రోజు అందరూ సంతోషంగా ఉండాల్సిన వేళ.. ఏం ఆపద వచ్చిందో గానీ ఆమె ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇప్పుడు ఇద్దరు ఆడ పిల్లలు అనాథలుగా మారిపోయారు. నా అనే వారు లేక అమ్మమ్మగా పిలిచే వెంకటలక్ష్మీ పెద్దమ్మ లక్ష్మీ వద్ద తలదాచుకుంటున్నారు. ప్రస్తుతం చిన్నారులు శరణ్య, లిఖితలు స్థానిక తేలుకుంచి ప్రాథమికోన్నత పాఠశాలలో 4, 2వ తరగతి చదువుతున్నారు. ఇకపై వీరి ఆలన పాలన చూసేవారు ఎవరో తెలీడం లేదు. వృద్ధాప్య దశలో ఉన్న తాను నాలుగిళ్లలో బట్టలు ఉతికితే గానీ నాలుగు మెతుకులు నోటికి వెళ్లే పరిస్థితి లేదని, ఇద్దరు ఆడ బిడ్డలను ఎలా పెంచి పెద్ద చేయగలనని అమ్మమ్మ లక్ష్మి కన్నీరు పెట్టుకుంటున్నారు. దాతలు స్పందించి పిల్లల భవిష్యత్‌కు భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు.

సాయం చేయదలచుకున్న వారు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి నంబర్ 9441233763ను సంప్రదించాలని కోరుతున్నారు.